# నవతరం
తెలంగాణ రౌండప్
ఆదివారం, ఫిబ్రవరి 12, 2023 పేజీలు 6




## జీన్ ఎరిక్ వెర్గ్నే కు ట్రోఫీ ని అందజేసిన కేటీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నవతరం): హైదరాబాద్ వేదికగా “ఫార్ములా - ఈ” ప్రపంచ చాంపియన్ షిప్ రేసింగ్ అట్టహాసంగా జరిగింది. రేస్ ను వీక్షించేందుకు నగరవాసులు భారీగా తరలివచ్చారు. మొత్తం 2.8 కిలోమీటర్ల స్ట్రీట్ సర్క్యూట్ లో ప్రముఖ ఆటో మొబైల్ కంపెనీలకు చెందిన 22 మంది రేసర్లు పాల్గొన్నారు. రేస్ లో మొదటి స్థానం సాధించిన జీన్-ఎరిక్ వెర్గ్నే కు మంత్రి కేటీఆర్ ట్రోఫీని అందజేశారు.



5లో



## ఉగ్రవాదం, తీవ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలిస్తం : అమిత్ షా

దేశంలో శాంతి భద్రతల విషయంలో రాజీపడే ? ప్రసక్తే లేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. గత ఎనిమిదేళ్లలో వామపక్ష తీవ్రవాదాన్ని అడ్డుకోవడంతో పాటు పీఎఫ్ఐ ఉగ్రవాద సంస్థను నిషేధించామని చెప్పారు. హైదబాద్‌లోని నేషనల్ పోలీస్ అకాడమీలో 74 వ బ్యాచ్ ఐపీఎస్ అధికారుల పాసింగ్ ఔట్ పరేడ్ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరై ట్రైనీ ఐపీఎస్‌ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ప్రజాప్రతినిధులు ఐదేళ్లకోసారి ఎన్నికవుతారని కానీ ఐపీఎస్‌లకు 30 నుంచి 35ఏళ్ల పాటు అధికారం ఉంటుందన్నారు. ప్రతీ ఐపీఎస్ తన బాధ్యతను గుర్తుంచుకుని ముందుకు సాగాలని సూచించారు. ఈ బ్యాచ్‌లో అధికం శాతం టెక్నాలజీ బ్యాక్ గ్రౌండ్ వాళ్ళే ఉన్నారని.. రానున్న కాలంలో టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ఉగ్రవాదం, తీవ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని అమిత్ షా చెప్పారు. 8ఏళ్ల క్రితం దేశం అంతర్గత ఆందోళనలతో అట్టుడుకిందని.. కానీ నేడు ఆ పరిస్థితి లేదని అమిత్ షా అన్నారు. 7 దశాబ్దాలుగా అంతర్గత భద్రత రంగంలో అనేక సవాళ్లను ఎదుర్కొన్నామని, ఈ పరిస్థితుల్లో 36 వేల మంది పోలీసులు అమరులయ్యారని చెప్పారు. జమ్ము కాశ్మీర్ తీవ్రవాదము, ఈశాన్య రాష్ట్రాల్లో ఉగ్రవాదం, వామపక్ష తీవ్రవాదంతో సహా ఎన్నో సమస్యలు ఉండేవని.. అలాంటి సమస్యలన్నింటిని పూర్తిగా కట్టడి చేశామన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జీరో టాలరెన్స్ విధానంపై పని చేశామమన్నారు. అదేవిధంగా 2005లో ఆర్థిక వ్యవస్థలో 11వ స్థానంలో ఉన్న దేశాన్ని 5వ స్థానంలోకి నిలబెట్టామన్న షా.. త్వరితగతి దాన్ని కూడా అధిగమించి మూడవ స్థానాన్ని చేరుకుంటుందని ఆశిస్తున్నట్లు చెప్పారు.



## కొత్త సెక్రెటేరియట్ ప్రారంభోత్సవం వాయిదా

రాష్ట్ర నూతన సచివాలయం ప్రారంభోత్సవం వాయిదా పడింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా ప్రభుత్వం వాయిదా వేసింది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ఈ సెక్రెటేరియట్?ను మొదట సీఎం కేసీఆర్ పుట్టిన రోజైనా ఫిబ్రవరి 17న ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ ప్రారంభోత్సవానికి పలు రాష్ట్రాల సీఎంలు, నాయకులనూ ఆహ్వానించారు. ఇంతలో తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. దీంతో ఎలక్షన్ కోడ్ అమలులో ఉండడంతో సచివాలయం ప్రారంభోత్సవాన్ని వాయిదా వేసినట్లు ప్రభుత్వం చెప్పింది. త్వరలోనే కొత్త సచివాలయం ప్రారంభోత్సవానికి సంబంధించిన తేదీని ప్రకటించనున్నారు.



3లో

## కొంపల్లి ఊర చెరువు పూడ్చివేతపై వెలుగులోకి వస్తున్న నిజాలు

# జోగులాంబ ఆలయాన్ని దర్శించుకున్న ఐ.జి

### ఆలయానికి వెండి పళ్ళెం విరాళం

### అన్నదానం కు మరో భక్తుడు రూ.50 వేలు విరాళం





అలంపూర్, ఫిబ్రవరి 11 (నవతరం): అలంపురం జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాలు శనివారం ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు వీరికి ఆలయ ఈవో పురంధర్ కుమార్ ఘన స్వాగతం పలికారు. ఉభయ ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు వేద ఆశీర్వచనం చేశారు. ఇదిలా ఉండగా శనివారం రోజు హైదరాబాద్ లోని కర్మన్ఘాట్ వాస్తవ్యులు జగన్మోహన్ గౌడ్ సుమలత దంపతులు ఒక కేజీ 450 గ్రాముల వెండి పళ్ళెం సమర్పించారు. అలాగే హైదరాబాద్ కు చెందిన మరో భక్తుడు అజయ్ కుమార్ అన్నదాన సత్రం కోసం 50 వేల రూపాయలు విరాళాన్ని అందజేసినట్టు ఈవో పురేందర్ కుమార్ తెలిపారు.

# మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు

### నాలాలకు అదనంగా నిధులు మంజూరు చేయాలని

### అసెంబ్లీలో మంత్రి కేటీఆర్ కు ఎమ్మెల్యే విజ్ఞప్తి

### స్పందించిన మంత్రి కేటీఆర్.. మంజూరు చేస్తానని హామీ.



హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నవతరం): తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఎస్.ఎన్.డి.పి.లో చేపడుతున్న పనులపై ఈరోజు ఎమ్మెల్యే కేపి వివేకానంద్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై మాట్లాడారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఎస్.ఎన్.డి.పి. పనులకు కేటాయించిన రూ.985 కోట్లలో సుమారు రూ.200 కోట్లతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో 3 నాలాల అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. వీటిలో 2 నాలాల పనులు శరవేగంగా జరుగుతున్నాయని, పనులు పూర్తైన ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసినా కొంత ఊరట లభిస్తుందని ఇందుకు సహకారం అందించిన పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ కు ధన్యవాదాలు తెలిపారు. ఆయా నాలాల నిర్మాణానికి ప్రతిపాదించిన నిధులు జీఎస్టీ ఇతరత్రా మూలాన 15 నుండి 20 శాతం పెరగడంతో పనులు పూర్తి కావడం లేదని, అదనంగా నిధులు మంజూరు చేస్తే పనులు వేగంగా పూర్తవుతాయని మంత్రి కేటీఆర్ ను కోరారు. అదే విధంగా ఫాక్స్ సాగర్ కోల్ నాలా ప్రాజెక్ట్ అనుకున్న సమయంలో పూర్తి చేయాలంటే అదనంగా రూ.10 కోట్లు మంజూరు చేయాలని, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కొంత పనులు మిగిలి ఉన్నాయని, శ్రీనివాస్ హౌసింగ్ కాలనీలో 200 మీటర్ల అదనంగా నాలా నిర్మించాల్సి ఉందని అందుకు అదనంగా నిధులు మంజూరు చేస్తే పనులు పూర్తవుతాయని మంత్రి కేటీఆర్ ను కోరారు. ఎస్.ఎన్.డి.పి.ఫేస్-2లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో చేపట్టబోయే పనులకు వ్యయ ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందని వాటికి నిధులు మంజూరు చేయాలని మంత్రి ను ఎమ్మెల్యే కోరారు. కొత్తగా ఏర్పాటైన కొంపల్లి, ఫీర్జాదిగూడ, బడంగ్ పేట్ అర్బన్ లోకల్ బాడీస్ కు నిధులు మంజూరు చేయాలని, ముఖ్యంగా నాలాలను రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపాలిటీ రికార్డ్స్ లో పొందుపర్చే విధంగా చర్యలు చేపడితే కబ్జాలకు తావు ఉండదని మంత్రి కేటీఆర్ ను కోరారు. ఎమ్మెల్యే లేవనెత్తిన అంశాలకు మంత్రి కేటీఆర్ సమాధానం ఇస్తూ.. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో పని చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం అధిక జీఎస్టీ విధించి ఇబ్బందులకు గురి చేస్తోందని అన్నారు. ఎమ్మెల్యే ప్రతిపాదనలకు అనుగుణంగా అవసరమైన నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.



# ఆర్టీసీ బస్సు బోల్తా

### 15 మందికి గాయాలు

వనపర్తి జిల్లా కొత్తకోట హైవేపై ఆర్టీసీ బస్సు ఇవాళ తెల్లవారుజామున బోల్తా పడింది. ఎస్ఐ నాగశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్టకు చెందిన ఆర్టీసీ బస్సు 37 మంది ప్రయాణికులతో హైదరాబాదు నుండి తిరుపతి వెళ్తోంది. తెల్లవారుజామున రెండు గంటల సమయంలో కొత్తకోట పట్టణం నుంచి వెళ్తుండగా.. మదర్ థెరిసా జంక్షన్ దగ్గరకు రాగానే ఉన్నట్టుండి బస్సు బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న 15 మందికి గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను 108 ద్వారా వనపర్తి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. డ్రైవర్ నిద్రమత్తులో ఉండడం, నిర్లక్ష్యం కారణంగానే బస్సు బోల్తా పడిందని పోలీసులు చెబుతున్నారు.



## లోకదాలత్ ద్వారా వివాదాలను పరిష్కరించుకోవచ్చు

### జూనియర్ సివిల్ జడ్జి కమలాపురం కవిత

అలంపూర్, ఫిబ్రవరి 11(నవతరం): న్యాయస్థానాలు నిర్వహించే లోక్ అదాలత్ ద్వారా వివాదాలను పరిష్కరించుకోవచ్చునని జూనియర్ సివిల్ జడ్జి కమలాపురం కవిత అన్నారు. శనివారం అలంపూర్ జూనియర్ సివిల్ కోర్టు నందు లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసులను సత్వరమే పరిష్కరించి బాధితుల మధ్య రాజీ కుదిర్చేందుకు కోర్టులు లోక్ అదాలత్ నిర్వహిస్తున్నాయని, లోక్ అదాలత్ ద్వారా బాధితుల పరస్పర అంగీకారంతో కేసులను పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. ఈ లోక్ అదాలత్ ద్వారా 93 వివాదాలు పరిష్కారం అయ్యాయని తెలిపారు. బాధితుల పరస్పర రాజీ వల్ల 24 కేసులు పరిష్కారం అయ్యాయని, అపరాధ రుసుము ద్వారా 67 కేసులు, రెండు సివిల్ వివాదాలు పరిష్కారమయ్యావని తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా అపరదరసము 1 లక్ష 52 వేల ఒక వంద రూపాయలు వచ్చాయని లోక్ అదాలత్ ఇంచార్జి సాయి తేజ తెలిపారు. ఈ కార్యక్రమంలో పీపీ కార్తీక్ ఉన్నారు.








**కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రభుత్వ జూనియర్, ఒకేషనల్, డిగ్రీ కళాశాల సమస్యల పై ప్రజా ప్రతినిధి, అధికారుల నిర్లక్ష్యం పై నిరసనగా విద్యార్థుల సమస్యలు తెలియపరుస్తూ పోస్ట్ కార్డ్ ద్వారా సీఎం, ఎడ్యుకేషన్ మినిస్టర్, జిల్లా కలెక్టర్ కు సమస్యలు వివరిస్తూ పోస్ట్ చేసిన సాయికుమార్ పంతుల.**

- కుత్బుల్లాపూర్, నవతరం

# మైనారిటీల రిజర్వేషన్లు పెంచాలి

**12శాతం మైనారిటీల వాటా ఒక్క శాతమేనా?**

**హైదరాబాద్ చుట్టూ కంపెనీలలో ముస్లింల వాటా ఏది**

**వక్ఫ్ బోర్డు భూములపై విచారణ జరపాలి**

**మైనారిటీలకు 12 శాతం ఎమ్మెల్యే టికెట్లు ఇస్తాం**

**డా. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్,**
**రాష్ట్ర అధ్యక్షులు, బహుజన్ సమాజ్ పార్టీ**



లక్డీకాపూల్ / హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నవతరం): తెలంగాణ రాష్ట్ర జనాభాలో 12 శాతం ఉన్న మైనారిటీలకు వార్షిక బడ్జెట్ లో కేవలం ఒక శాతం మాత్రమే కేటాయింపులు జరపడం అన్యాయమని డా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో మైనారిటీలు కూడా పాల్గొన్నారని, కేసుల పాలయ్యారని కానీ సాధించుకున్న తెలంగాణలో మైనారిటీలు నిరాధరణకు గురయ్యారని తెలిపారు. నేడు బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ముస్లిం పెద్దలతో కలిసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హైదరాబాద్ నగరంలో వందలాది కంపెనీలు పెట్టి, వేలమందికి ఉద్యోగాలిస్తామని పేర్కొన్న మంత్రి కేటిఆర్ అందశలో మైనారిటీల వాటా ఎంతో చెప్పాలని డిమాండ్ చేశారు. మైనారిటీల కోసం ఉపయోగించాల్సిన భూమిని కబ్జా చేస్తూ,ధనికులకు అప్పజెప్పి కంపెనీలు పెట్టించి వచ్చిన ఆదాయాన్ని ముస్లింల అభివృద్ధి కోసం వాడడం లేదని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వక్ఫ్ బోర్డు భూములపై సిబిఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. 12 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిన కేసిఆర్ ఎందుకు పెంచడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మైనారిటీలకు కాగితాలపై లెక్కలు, పండుగలకు బట్టలు ఇవ్వడం కాదని, బడ్జెట్ లో 12 శాతం వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ బోర్డు భూములను మైనారిటీల అభివృద్ధి కోసం ఉపయోగించాలని డిమాండ్ చేశారు. తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మైనారిటీలకు ఒరిగిందేమీ లేదన్నారు. కానీ బహుజన్ సమాజ్ పార్టీ మైనారిటీల జనాభా ఎంత ఉంటే బడ్జెట్ లో అంత కేటాయింపులు చేస్తామని హామీ ఇచ్చారు. రాబోయే ఎన్నికల్లో కాన్షీరాం సిద్దాంతం ప్రకారం, మైనారిటీల జనాభా దామాషా ప్రకారం వారికి 12 శాతం అసెంబ్లీ స్థానాల్లో టికెట్లు ఇస్తామని స్పష్టం చేశారు. దమ్మంటే బీఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్ పార్టీలు ఎన్ని సీట్లు ఇస్తాయో చెప్పాలని సవాల్ చేశారు. యూపిలో బెటహన్ జీ మాయావతి సపోర్ట్ చేసిన విధంగా, తెలంగాణలో మైనారిటీలకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. బహుజన రాజ్యంలోనే మైనారిటీల బతుకులు మారుతాయని, మైనారిటీలంతా బీఎస్పి పార్టీతో కలిసి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షులు మౌలానా ఖైరుద్దీన్ సుఫీ, ఎం.డి రుకోనుద్దీన్, అబ్దుల్ రహీం ఖాన్, బీఎస్పి మైనారిటీ రాష్ట్ర నాయకులు అబ్రార్ హుస్సేన్, మహ్మద్ షఫీ, సజ్జాద్, అబిదా తదితరులు పాల్గొన్నారు.



## శాసనమండలి ప్రభుత్వ విప్‌గా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు నియామకం



మేడ్చల్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 11 (నవతరం): మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తెలంగాణ రాష్ట్ర శాసన మండలి విప్ గా నియమితులయ్యారు. ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి కేసీఆర్ కు, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ పురపాలక శాఖమంత్రి కేటీఆర్ కు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కృతజ్ఞతలు తెలిపారు.



## కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే కేపి వివేకానంద్

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నవతరం): కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధికి చెందిన కార్మికుల సమస్యలపై తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ఎమ్మెల్యే కేపి వివేకానంద్ ప్రస్తావించారు. జీడిమెట్ల పారిశ్రామిక వాడలో ఉన్న సూపర్ మాక్స్ కంపెనీలో పని చేస్తున్న కార్మికుల పరిస్థితి దీనంగా ఉందని, ఐదు నెలలుగా కంపెనీ నడవక అందులో పని చేస్తున్న కార్మికులకు జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, యాజమాన్యం మధ్య నెలకొన్న గొడవ మూలాన ఐదు నెలలుగా కంపెనీ నడవక, కార్మికులకు జీతాలు లేవని, సమస్య ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి వచ్చిందని, ఈ సమస్య పరిష్కారం కోసం లేబర్ కమిషనర్ మరియు ఇండస్ట్రీస్ ప్రిన్సిపల్ సెక్రెటరీలు సమావేశమయ్యేలా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చర్యలు తీసుకోవాలని అన్నారు. హెచ్ఎంటీ విశ్రాంత ఉద్యోగులకు సుమారు 300 కోట్ల బకాయిలు పెండింగ్ లో ఉన్నాయని, ఐదేళ్లు గడుస్తున్నా సమస్య పరిష్కారం కావడం లేదని, శేష జీవితాన్ని సంతోషంగా గడపాల్సిన రిటైర్డ్ ఉద్యోగులు ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఆందోళన చెంది కొందరు మరణిస్తున్నారని తీవ్రమైన ఈ సమస్య పరిష్కారానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి ప్రత్యేక దృష్టి వహించి కేంద్ర కార్మిక శాఖ మంత్రి తో చర్చించి వేగంగా సమస్య పరిష్కారం అయ్యేలా వారికి రావాల్సిన బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంకు మంజూరైన ఐటిఐ కళాశాల త్వరలోనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే లేవనెత్తిన అంశాలకు కార్మిక శాఖ మంత్రి సమాధానమిస్తూ.. కార్మికుల సమస్యల పరిష్కారానికి తప్పక చర్యలు తీసుకుంటామని అన్నారు.

# కొంపల్లి ఊర చెరువు పూడ్చివేతపై వెలుగులోకి వస్తున్న నిజాలు



పేట్ బషీరాబాద్, ఫిబ్రవరి 11 (నవతరం): బహిరంగంగా భారీ ఎత్తున చెరువు ఎఫ్ టీ ఎల్, బఫర్ జోన్ భూముల్లో టిప్పర్ల కొద్ది మట్టిని తరలిస్తున్న పట్టించుకోలేదు. నెలరోజుల అనంతరం చెరువులో మట్టి పోసి పూడ్చివేస్తున్నారంటూ ఫిర్యాదు చేయడంపై పలువురు పెదవిరుస్తున్నారు. మట్టి పోస్తున్న విషయం దృష్టికి వచ్చిన రెండు మూడు రోజులు లేదా వారం రోజుల పరిధిలో పోలీసులకు ఫిర్యాదు చేయకుండా నెల రోజుల తరబడి వేచి ఉండి అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయడంపై బేరం కుదరకనే కేసు పెట్టారంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. దుండిగల్ గండి మైసమ్మ మండల పరిధి, కొంపల్లి గ్రామంలో ఉన్న ఊర చెరువు పూడ్చివేత ప్రత్యేక కథనం. చెరువును మట్టితో పూడ్చి వేస్తున్నారనే సమాచారంతో రెవిన్యూ సిబ్బంది సబ్బంది ఆక్రమణ దారులు హెచ్చరించారు. అయినా.. వారు వినకుండా టిప్పర్ల కొద్ది మట్టిని తెచ్చి దాదాపుగా నాలుగు ఎకరాల మేర చెరువును పూడ్చి వేశారని రెవెన్యూ సిబ్బంది తెలిపారు. అనంతరం మట్టిని అక్రమంగా తరలిస్తున్న తరుణంలో ఆర్ఎస్ఐ, సర్వేయర్, వీఆర్ఎలు వెళ్లి క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించారు. అప్పుడే వారిపై ఫిర్యాదు చేయకుండా రోజుల తరబడి వేచి ఉండి దాదాపుగా 50 టిప్పర్ల కు పైగా మట్టిని తెచ్చి చెరువులో పూడ్చి వేసేదాకా చోద్యం చూశారు. ఆ తరువాత తాపీగా పోలీసులకు ఫిర్యాదు చేయడంపై మధ్యలో ఏం జరిగి ఉంటుందనే విషయం పలు అనుమానాలు తావిస్తోంది. రెవెన్యూ సిబ్బందిని తొలుత అటువైపు వెళ్ళద్దంటూ ఆదేశాలు ఇచ్చిన ఓ నాయకుడు, కొన్ని రోజుల తర్వాత తిరిగి అతనే చెరువును పూడ్చి వేస్తుంటే రెవెన్యూ సిబ్బందిపై చిరుబుర్రులాడారని సమాచారం. దీంతో చేసేదేమీ లేక రెవిన్యూ సిబ్బంది ఫిబ్రవరి 4న పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో అక్రమార్కులతో బడా నాయకుడికి బేరం కుదరకపోవడంతోనే రెవెన్యూ సిబ్బందిపై అగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇందులో ఆసక్తికర విషయం ఏంటంటే.. అంత పెద్ద ఎత్తున చెరువును పూడ్చి వేసినా.. ఎమ్మార్వో కార్యాలయానికి చెందిన క్రింది స్థాయి సిబ్బంది వీఆర్ఎతో ఫిర్యాదు ఇప్పించడం గమనర్హం.

### మట్టిని తొలగించి స్వాధీనం చేసుకుంటాం: ఎమ్మార్వో

పద్మప్రియ చెరువు పూడ్చిన అంశంపై ఇప్పటికే ఎఫ్ఎఆర్ రిజిస్టర్ అయింది. చెరువులో వేసిన మట్టిని తొలగించే పనులను వేగవంతం చేస్తాం.ఇందుకోసం జేసీబీలు కావాలని మున్సిపల్ కార్యాలయంలోని ఉన్నతాధికారులకు విన్నవించాం. చెరువును కబ్జా గురికాకుండా కాపాడుతాం. చెరువు ఎఫ్ టీ ఎల్ సరిహద్దుల్లో పిల్లర్స్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నాం.

# సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే కేపి వివేకానంద్ చిత్ర పటానికి పాలాభిషేకం



హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నవతరం): కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపి వివేకానంద్ నాయి బ్రాహ్మణుల సమస్యలను అసెంబ్లీ వేదికగా మాట్లాడినందుకు నాయి బ్రాహ్మణ సేవా సంఘం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే కేపి వివేకానంద్ చిత్ర పటానికి చింతల్ లోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద పాలాభిషేం చేసి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గం అధ్యక్షుడు ఏ.రేణయ్య నాయి, ప్రధాన కార్యదర్శి కే పరమేష్ నాయి, గౌరవ అధ్యక్షులు మైలారం యాదగిరి నాయి, సలహాదారులు బిక్షపతి నాయి, ఎలక్ట్రానిక్ మీడియా ప్రచార కార్యదర్శి పి శివ కుమార్ నాయి, ఉపాధ్యక్షులు మహేష్ నాయి బాలేశ్వర్ నాయి, జి శ్రీనివాస్ నాయి, నాగరాజు నాయి, జాయింట్ సెక్రెటరీ ఆంజనేయులు నాయి, నిరంజన్ నాయి, వెంకటేష్ నాయి, గణేష్ నగర్ కమిటీ అధ్యక్షులు రామ్ చందర్ నాయి, సూరారం కమిటీ జనరల్ సెక్రటరీ బాల వీర్ నాయి, ఉపాధ్యక్షులు నరేష్ నాయి, సాయి నాయి, షాపూర్ నగర్ కమిటీ ప్రధాన కార్యదర్శి దాసునాయి, కుత్బుల్లాపూర్ కమిటీ అధ్యక్షులు నారాయణ నాయి, క్యాషియర్ నరేష్ నాయి, వర్కింగ్ ప్రెసిడెంట్ రవినాయి, కాశయ్య నాయి, గణేష్ నగర్ కమిటీ 2 అధ్యక్షులు కోటినాయి, కృష్ణ నాయి, జగద్గిరిగుట్ట కమిటీ చంటినాయి, మల్లేష్ నాయి, గాజులరామారం కమిటీ సోదరులు పాల్గొన్నారు.

# ఫిర్యాదుదారులను అరెస్టు చేసిన పోలీసులు




పేట్ బషీరాబాద్, దుండిగల్: ప్రజా అవసరాల కోసం వదిలిపెట్టిన పార్కు స్థలంలో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని, కాలనీవాసులు సంబంధిత శాఖ అధికారులతో పాటుగా పోలీసులు కూడా ఫిర్యాదు చేశారు. టౌన్ ప్లానింగ్ అధికారులు స్థలాన్ని పరిశీలించి అక్రమ నిర్మాణమని తెలిసి ఆ నిర్మాణాన్ని నేలమట్టం చేశారు. కాగా కాలనీవాసులు ఫిర్యాదు ఇచ్చిన రెండు రోజులకు కాలనీలో పోలీసులు ప్రత్యక్షమయ్యారు. మాట్లాడాలి అంటూ పిలిచిన కాలనీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షులను బలవంతంగా పోలీసు వాహనంలో ఎక్కించుకొని స్టేషన్ కు తీసుకెళ్లారు. దీంతో ఫిర్యాదు చేసిన తమనే అన్యాయంగా పోలీసులు స్టేషన్ కు తరలించడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేస్తూ దుండిగల్ పోలీస్ స్టేషన్ ఎదుట శనివారం ఆందోళన చేపట్టారు. ఇది సూరారంకాలనీ సిద్ధి వినాయక నగర్ లో విస్తరించి ఉన్నా పార్కు స్థలం వివాదం.

**అసలు వివాదం ఏంటంటే..?**

సూరారంకాలనీ సర్వేనెంబర్ 105 లో 1978 సంవత్సరంలో సిద్ధి వినాయక నగర్ కాలనీ లేఅవుట్ చేశారు. ఇందులో ఎమినిటీస్ లో భాగంగా అప్పట్లో 1080 గజాల స్థలం పార్క్ కోసం విడిచిపెట్టారు. ఈ స్థలంలో కొందరు అక్రమంగా నిర్మాణ ప్రయత్నం చేస్తూ వస్తున్నారు. ఇదే క్రమంలో 2016లో ఈ స్థలంలో ఓ ఇంటిని నిర్మాణం చేసినప్పుడు అప్పటి టౌన్ ప్లానింగ్ అధికారులు ఆ నిర్మాణం అక్రమమని కూల్చేశారు. కబ్జాకుయత్నం చేస్తున్న పార్కు స్థలాన్ని గతంలో ఎల్ఆర్ఎస్ కోసం కబ్జాదారులు దరఖాస్తు చేసుకోగా దాన్ని సిటీ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ రద్దు చేసినట్లు కాలనీవాసులు పేర్కొంటున్నారు. తాజాగా ఇదే పార్కు స్థలంలో తిరిగి నిర్మాణ పనులు చేపట్టడంతో ఈ నెల 8వ తేదీన కాలనీవాసులు సదరు పార్కు స్థలాన్ని రక్షించాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం 100 కు డయల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పాటుగా జీహెచ్ఎంసీ కార్యాలయంలో కూడా ఫిర్యాదు చేశారు.

**ఒకరు చర్యలు తీసుకున్నారు.. ఒకరు మిన్నకున్నారు..**

సిద్ధి వినాయక నగర్ కాలనీవాసులు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన 100కు డయల్ చేసి సమాచారం ఇవ్వడంతో పాటుగా దుండిగల్ పోలీస్ స్టేషన్ లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అదేవిధంగా జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు వచ్చి సాధారణ నిర్మాణాన్ని నేలమట్టం చేశారు. అయితే పోలీసులు మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోకపోగా వారిని బెదిరించే ధోరణిలో వ్యవహరిస్తున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.

**ఫిర్యాదు ఇచ్చిన వాళ్లనే అదుపులోకి..**

రెండు రోజుల క్రితం కాలనీవాసులు కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దుండిగల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా శనివారం పోలీసులు సిద్ధి వచ్చి కాలనీ వినాయకనగర్ కు అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు దారం సాయికుమార్ లను స్టేషన్ కు తరలించారు. కబ్జా నుంచి పార్కు స్థలాన్ని కాపాడండి, మమ్మల్ని బెదిరిస్తున్నారంటూ కాలనీవాసులు ఫిర్యాదు చేస్తే వారిని స్టేషన్ కు తీసుకెళ్లడం విషయమై కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా..**

దుండిగల్ తమ కాలనీ అసోసియేషన్ సభ్యులను స్టేషన్ కు తీసుకెళ్లారని తెలుసుకున్న కాలనీవాసులు పోలీస్ స్టేషన్ కు చేరుకున్నారు. ఇచ్చిన ఫిర్యాదును పట్టించుకోకుండా తమ అసోసియేషన్ సభ్యులను ఏ విధంగా పోలీస్ స్టేషన్ కు తీసుకు వస్తారంటూ ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న కాలనీవాసులకు మద్దతు తెలుపుతూ సిద్ధి వినాయకనగర్ వాసులతో కలిసి పోలీస్ స్టేషన్ ఎదుట చేసిన ధర్నాలో పాల్గొన్నారు. ప్రభుత్వ భూములను రక్షించకపోగా కబ్జా చేసే వారికి మద్దతుగా ఉంటున్నారని పోలీసులపై ఆరోపణలు చేశారు.

**రాజకీయ ఒత్తిడితోనేనా..?**

సూరారం ప్రధాన రహదారికి అతి దగ్గరగా ఉన్న ఈ పార్కు స్థలం విలువ ఇప్పుడు కోట్లలో ఉంటుంది. దీనిని కొందరు రాజకీయ పలుకుబడితో కబ్జాకు యత్నం చేస్తున్నారని, వారి ఒత్తిడితోనే పోలీసులు ముందుగా తాము ఇచ్చిన ఫిర్యాదు గురించి పట్టించుకోవడం లేదన్నారు. కేవలం రాజకీయ ఒత్తిడితోనే మాపై పోలీసులు జులుం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు.

**ఫిర్యాదు రావడంతోనే స్టేషన్ కు పిలిచాం: సీఐ**

రమణారెడ్డి, దుండిగల్ పోలీస్ స్టేషన్ కాలనీ అసోసియేషన్ సభ్యులపై ఓ మహిళ ఫిర్యాదు చేసింది. తమ స్థలంలో అక్రమంగా చొరబడ్డారని సదరు మహిళల ఫిర్యాదులో పేర్కొనడంతోనే వారిని స్టేషన్ కు పిలిపించి మాట్లాడి పంపించాను. అంతేగాని ఎవరిని అరెస్ట్ చేయలేదు.



**కేసిఆర్ కు ధన్యవాదాలు తెలిపిన కుల సంఘాల నాయకులు**

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నవతరం): వాల్మీకి బోయలు, పెద్ద బోయలు, ఖాయితీ లంబాడాలు, మాలి సహ బేదర్, కిరాతక, నిషాది, భాట్ మధురాలు, చమర్ మధురాలు, చుండువాళ్లు, తలయారి కులాలను ఎస్టీల్లో చేర్చాలన్న అసెంబ్లీ తీర్మానం నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, ఆయా కుల సంఘాల నేతలు, సీఎం కేసీఆర్ ను కలిసి ధన్యవాదాలు తెలిపారు.



## కెసిఆర్ కు ధన్యవాదాలు తెలిపిన ఏజెన్సీ ప్రాంతాల నాయకులు

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నవతరం): పోడు భూముల వ్యవహారానికి సంబంధించి శాశ్వత పరిష్కారం దిశగా, గిరిజనులకు మేలు కలిగే విధంగా ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు అసెంబ్లీలో ప్రకటన చేసిన సందర్భంగా పోడు ప్రభావిత ఏజెన్సీ ప్రాంతాల ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ఎమ్మెల్యేలు జోగు రామన్న, బాల్క సుమన్, కోనేరు కోనప్ప, దుర్గం చిన్నయ్య, రేఖా నాయక్, బాపూరావు, విఠల్ రెడ్డి, ఆత్రం సక్కు తదితరులున్నారు.






## రాజా విక్రమాదిత్య మహా నాటక ప్రదర్శనకు బీజేపీ నాయకులు

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 11 (నవతరం): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని జీడిమెట్ల హెచ్. ఎం. టి మైదానంలో సాయంత్రం మధ్యప్రదేశ్ సాంస్కృతిక శాఖ సహకారంతో జరిగిన రాజా విక్రమాదిత్య మహా నాటక ప్రదర్శనకు జాతీయ నాయకులు మురళీధర్ రావు, ఎస్ మల్లారెడ్డి రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు, బిజెపి రాష్ట్ర ఓబిసి కార్యవర్గ సభ్యులు జెకె శేఖర్ యాదవ్, రాష్ట్ర సీనియర్ నాయకులు కొత్తలాపూర్ సీనియర్ నాయకులు 126 డివిజన్ బిజెపి వైస్ ప్రెసిడెంట్ గండి రాజు యాదవ్, డివిజన్ సోషల్ మీడియా కన్వీనర్ నాగరాజు ముదిరాజ్, కుమార్ యాదవ్, ఆంజనేయులు యాదవ్, తదితర నాయకులు పాల్గొన్నారు.





# ఫార్ములా ఈ-రేసింగ్ గ్రాండ్ సక్సస్



రయ్యే శబ్దం.. వంపులు తిరిగిన ట్రాక్.. వాయు వేగంతో దూసుకుపోయిన కార్లు.. ప్రేక్షకుల కేరింతలతో ఫార్ములా ఈ-రేసింగ్ గ్రాండ్ సక్సెస్ అయ్యింది. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని రెండు రోజుల షెడ్యూలుతో హుసేన్‌సాగర్ తీరం లో ఈ పోటీలను నిర్వహించిన విషయం తెలిసిందే. శుక్రవారం ప్రీ ప్రాక్టీస్ రేస్-1ను, శనివారం ఉదయం ప్రీ ప్రాక్టీస్ రేస్-2ను నిర్వహించారు. అనంతరం క్వాలిఫైయింగ్ రౌండ్‌తో పాటు చివరకు ఫైనల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొత్తం 22 మంది డ్రైవర్లు పాల్గొని ఎలక్ట్రిక్ కార్లతో దుమ్ము లేపారు. మరోవైపు ఈ అంతర్జాతీయ పోటీలను తిలకించేందుకు దేశ విదేశాల నుంచి ప్రతినిధులతో పాటు ప్రముఖులు, రాజకీయ నాయకులు, క్రికెటర్లు, సినీతారలు విచ్చేశారు.













## ఈనెల 12న ముంబైలో గ్రాండ్ రిసెప్షన్..!

బాలీవుడ్ లవ్ బర్డ్స్ సిద్ధార్థ్ మల్హోత్రా - కియారా అద్వాణీ ఈ నెల 7న వివాహ బంధంతో ఒక్కటయ్యారు. రాజస్థాన్ జైసల్మేర్లోని సూర్యగఢ్ ప్యాలెస్‌లో కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో వీరి వివాహం అంగరంగ వైభవంగా జరిగింది. వివాహం అనంతరం సిద్ధార్థ్ కొత్త పెళ్లి కూతురితో కలిసి గురువారం తొలిసారిగా ఢిల్లీలోని తన నివాసంలో అడుగు పెట్టాడు. ఈ నేపథ్యంలో అదేరోజు రాత్రి ఢిల్లీలోని లీలా ప్యాలెస్‌లో కుటుంబ సభ్యులు గ్రాండ్‌గా రిసెప్షన్ జరిపించారు. తాజాగా ఈ జంట ముంబైలో సినీ తారల కోసం గ్రాండ్‌గా మరో వెడ్డింగ్ రిసెప్షన్ ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ముంబైలోని ఓ హోటల్‌లో ఈనెల 12వ తేదీన సాయంత్రం 8:30 గంటలకు రిసెప్షన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రిసెప్షన్ ఏర్పాట్ల కోసం ఈ జంట శనివారం ఢిల్లీ నుంచి ముంబై వెళ్లనున్నట్లు తెలుస్తోంది. ఈ గ్రాండ్ వెడ్డింగ్ రిసెప్షన్‌కు బాలీవుడ్ సెలబ్రిటీలు, పలువురు పారిశ్రామికవేత్తలు హాజరుకానున్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన ఇన్విటేషన్ కార్డు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. ఈ రిసెప్షన్‌కు కరణ్ జోహార్, షాహిద్ కపూర్, మనీశ్ మల్హోత్ర, షారుక్ ఖాన్, వరుణ్ ధావన్, అక్షయ్ కుమార్, పరిణీతి చోప్రా, జుహీ చావ్లా, అనిల్ కపూర్, అజయ్ దేవగణ్, రకుల్ ప్రీత్ సింగ్ తదితర సెలబ్రిటీలు సహా కుటుంబ సభ్యులు, పలువురు పారిశ్రామికవేత్తలు హాజరుకానున్నట్లు సమాచారం. షేర్షా సినిమాతో ఆన్‌స్క్రీన్ హిట్ పెయిర్‌గా నిలిచిన సిద్ధార్థ్, కియారా కొంతకాలానికి ప్రేమలో పడ్డారు. అనంతరం ఇరు కుటుంబ సభ్యుల అంగీకారంతో వివాహ బంధంతో ఒక్కటయ్యారు. హిందీ చిత్రసీమలో అగ్ర కథానాయికగా రాణిస్తున్న కియారా అద్వాణీ తెలుగులో 'భరత్ అనే నేను' 'వినయ విధేయ రామా' చిత్రాల ద్వారా ప్రేక్షకులకు చేరువైంది.

## ధనుష్ సార్ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు గెస్ట్‌గా స్టార్ హీరో?



తమిళ హీరో ధనుష్‌కు తెలుగులోనూ మంచి మార్కెట్ ఉంది. 'రఘువరన్, మారి, తిరు వంటి సినిమాలు ధనుష్‌కు టాలీవుడ్‌లో మంచి గుర్తింపు తెచ్చిపెట్టాయి. కాగా ధనుష్ ప్రస్తుతం తెలుగులో తన మార్కెట్ పెంచుకునే పనిలో పడ్డాడు. ఈ క్రమంలోనే తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరితో చేతులు కలిపి 'సార్' సినిమా చేశాడు. ద్విభాష చిత్రంగా తెరకెక్కుతున్న ఈ మూవీ మహాశివరాత్రి కానుకగా ఫిబ్రవరి 17న రిలీజ్ కానుంది. ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన పాటలు, టీజర్ సినిమాపై ఎక్కడలేని బజ్ తెచ్చిపెట్టాయి. ఇక ఇటీవలే రిలీజైన ట్రైలర్ సినిమాపై ఎక్కడలేని అంచనాలు క్రియేట్ అయ్యాయి. కాగా తాజాగా ఈ సినిమా క్రేజ్‌ను మరో లెవల్‌కు తీసుకెళ్లేందుకు చిత్రబృందం హైదరాబాద్‌లో గ్రాండ్‌గా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ప్లాన్ చేస్తుందట. అంతేకాకుండా పవన్ కళ్యాణ్‌ను గెస్ట్‌గా తీసుకొచ్చే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తుంది. ఈ సినిమాను సితార సంస్థతో కలిసి త్రివిక్రమ్ తన స్వంత బ్యానర్ ఫార్చ్యూన్ ఫోర్‌పై నిర్మించాడు. దాంతో పవన్ ఈవెంట్‌కు వస్తే సినిమాపై క్రేజ్ అమాంతం పెరుగుతుందని త్రివిక్రమ్ భావిస్తున్నాడట. మాములుగా పవన్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లకు రావడానికి ఎక్కువగా ఇష్టపడడు. కానీ త్రివిక్రమ్ పిలిస్తే మాత్రం వచ్చే అవకాశం లేకపోలేదు.



నేషనల్ క్రష్ రష్మిక 'పుష్ప'తో పాన్ ఇండియా క్రేజ్ తెచ్చుకుంది. ప్రస్తుతం ఈ అమ్మడి చేతిలో మూడు ప్రాజెక్ట్‌లున్నాయి. ఆ మూడు పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లు కావడం విశేషం. ఇక రష్మిక ఈ మధ్య ఎక్కువగా వార్తల్లో నిలుస్తుంది. కాగా మరోసారి ఈ అమ్మడుకి సంబంధించిన ఓ వార్త నెట్టింట తెగ వైరల్ అవుతుంది. రష్మిక ఐదు సిటీల్లో 5లగ్జరీ అపార్టుమెంట్‌లు కొనుగోలు చేసినట్లు గత రెండు రోజులుగా వార్తలు వస్తున్నాయి. రష్మిక సంపాదన మొత్తం ప్రాపర్టీస్‌పై ఇన్వెస్ట్ చేస్తుందని, అందులో భాగంగానే ముంబై, కూర్గ్, హైదరాబాద్, గోవా, బెంగళూరులో కాస్ట్లీ అపార్టుమెంట్‌లు కొనుగోలు చేసినట్లు ఓ వార్త చక్కర్లు కొడుతుంది. కాగా వీటిపై రష్మిక తాజాగా స్పందించింది. అవన్నీ అబద్ధాలని, అలాంటివి ఎవరు సృష్టిస్తున్నారో తెలియదని, అవి నిజమైతే బాగుండని వెల్లడించింది. దాంతో రష్మికపై వస్తున్న వార్తలు అవాస్తవమని క్లారిటీ వచ్చేసింది. ఇక ఈ మధ్య రష్మిక వివాదాల్లో ఎక్కువగా ఇరుక్కుంటుంది. ఇదే విషయాన్ని ఇటీవలే రష్మిక ఓ ఇంటర్వ్యూలో

## 5 లగ్జరీ అపార్టుమెంట్‌లు కొనుగోలు

తను ఏం చేసినా కొందరికి నచ్చడం లేదని, ఏది మాట్లాడినా తప్పు వెతుకుతున్నారని, తనపై చాలా నెగెటీవిటీ స్ప్రెడ్ చేసు_న్నారని తెలిపింది. ఇక రష్మిక ప్రస్తుతం పుష్ప-2 షూటింగ్‌లో బిజీగా ఉంది.



## సమ్మర్‌లో శాకుంతలం..

ఒకప్పుడు ముందుగా నిర్ణయించిన తేదీకే ఎట్టి పరిస్థితుల్లో సినిమాను రిలీజ్ చేసేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. ఈ రోజుల్లో సినిమాలు ఒక రిలీజ్ డేట్‌కు కట్టుబడి ఉండడం చాలా కష్టం అయిపోతుంది. 'ఆర్ఆర్ఆర్' లాంటి సినిమానే నాలుగైదు సార్లు పోస్ట్ పోన్ అయింది. ఇక ప్రభాస్ ఆదిపురుష్ కూడా ఎన్నో సార్లు వాయిదా పడింది. రేపో మాపో విడుదలవుతుంది అనుకునే టైమ్‌లో పోస్ట్ పోన్ అంటూ మేకర్స్ అభిమానులను తీవ్రంగా నిరాశపరుస్తారు. తాజాగా శాకుంతలం టీమ్ కూడా ఇలానే సామ్ అభిమానులకు షాక్ ఇచ్చింది. మరో పది రోజుల్లో రిలీజ్ కానుందనగా పోస్ట్‌పోన్ చేస్తున్నట్లు ఓ నోట్‌ను విడుదల చేసి అందరికి షాక్ ఇచ్చారు. కాగా అప్పుడు కొత్త డేట్‌ను ప్రస్తావించలేదు. తాజాగా మేకర్స్ కొత్త డేట్‌ను ప్రకటించారు. ఈ సినిమా ఏప్రిల్ 14న రిలీజ్ కానుందంటూ ఓ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ కాబోతున్న ఈ సినిమాకు గుణ శేఖర్ దర్శకత్వం వహించాడు. మహాభారతంలోని శకుంతల-దుష్యంతుడి ప్రేమకథ ఆధారంగా ఈ సినిమా రూపొందింది. ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన పోస్టర్‌లు, ట్రైలర్ సినిమాపై భారీ అంచనాలే క్రియేట్ చేశాయి. మలయాళ నటుడు దేవ్ మోహన్ ఈ సినిమాలో దుష్యంతుడిగా కీలకపాత్ర పోషించాడు. గుణ టీమ్ వర్క్స్ బ్యానర్‌పై నీలిమ గుణ ఈ సినిమాను అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మించింది.